"ఏమండోయ్! ఇది విన్నారా! అబ్బా బారెడు ప్రొద్దెక్కినా ఇంకా మొద్దునిద్దరే! ఏం క్లోజింగో.. ఏమిటో... అర్ధరాత్రి అయ్యాక రావటం.. ప్రొద్దెక్కినా లేవకపోవటం. ఎంత అర్ధరాత్రిళ్ళు వరకున్నా... మాకలాంటి సుఖమెక్కడిది?" మార్చి క్లోజింగ్ అంటూ తెల్లవారగట్ల మూడుగంటలకొచ్చి పడుకుని, పొద్దెక్కినా లేవని భర్తని లేపుతూ ముద్దుగా విసుక్కుంది రాధిక, పదోసారి లేపుతూ.

"ఆఁ... అబ్బా.. రాత్రి పొద్దుపోయాక పడుకున్నారనే జాలయినా లేకుండా ప్రొద్దుటే మొదలెట్టావూ.. ఇంతకీ ఏమయ్యిందని... అలా కొంపలంటుకు పోయినట్లు గావుకేకలేయకపోతే నెమ్మదిగా చెప్పేడవచ్చుగా."

"కొంపలంటుకు పోకపోయినా.. ఒకవిధంగా అలాంటి సంగతేనండీ! మరేమో మన కాలనీ వాళ్ళు, మనము అంతా... మన కాలనీలో ఉన్న బాంక్ లాకర్‌లలో సొమ్ములూ, డబ్బులు దాచుకోలేదుటండీ..."

# అబద్ధం

**- నామని సుజనాదేవి**



"ఆఁ.. దాచుకున్నాము. అయితే ఇప్పుడేమయ్యిందీ!"

"అబ్బా.. చెప్పేది పూర్తిగా వినండీ! మరేమో ఆ బ్యాంక్‌లో రాత్రి దొంగలు పడ్డారటండీ.. బాంక్ పరువు పోతుందని, కస్టమర్లు గోల చేస్తారని... ఈ విషయం బయటకు పొక్కనివ్వట్లేదటండీ!"

"నిజమా! బాంక్ పరువుపోవటమేమిటే! అయినా ఈ విషయం నీకెలా తెల్సిందప్పుడే." నిద్రమత్తు దెబ్బకు వదిలిపోగా అన్నాడు వంశీకృష్ణ.

"ఎవ్వరికీ చెప్పవద్దని మన పక్కింటి రాజేశమన్నయ్య వాళ్ళావిడతో ఇంతకు ముందే చెప్పారటండీ! మరేమో ఆవిడ నాతో చెప్పింది. ఈ పక్కింటి కామాక్షి, ఎదురింటి మీనాక్షి కూడా అదే చెబుతున్నారు."

"ఆఁ.. మరి మన నగలు.. ఎంత కష్టపడి చేయించాను.. ఓర్నాయనో.. కొంపలు మునిగాక ఇంకా ఎవరికీ చెప్పవద్దనటమేమిటీ.. ఆ పోలీసులు.. రిపోర్టు అంటూ పోయినవి, పోలీసుల చేతుల్లో పడ్డాక ఏం దక్కుతాయి. ఎట్లాగూ పోయాయంటే అందులో మనం పెట్టనివి కూడా, రెండు ఎక్కువే చెప్పి రిపోర్టు రాయించాలి. ముందర నేవెళ్ళి మొత్తం విషయమంతా ఆయన్ని డిగొస్తానాగు" అంటూ చక చకా రెడీ అయి బయల్దేరాడు వంశీకృష్ణ.

ఆయన వెంటే కుతూహలం ఆపుకోలేక రాధిక కూడా బయల్దేరి వెళ్ళింది.

సోఫాలో కూర్చుని కాఫీ తాగుతూ, పేపర్ చదువుతున్న రాజేశం, వంశీకృష్ణను చూడగానే, "నమస్తే.. రండి వంశీగారూ.. ఏంటి భార్యాసమేతంగా బయల్దేరారు? మాధవీ రెండు కాఫీలు తీసుకురా." అన్నాడు భార్యను కేకేస్తూ కూర్చోవటానికి కుర్చీలు చూపిస్తూ.

"ఇంకెక్కడికీ.. మీదగ్గరకేనండీ.. కాఫీ ఏమీ అవసరం లేదండీ.. మరేమో.. మన బ్యాంక్‌లో దొంగలు పడి లాకర్లలోని సొమ్మంతా ఎత్తుకుపోయారని అన్నారట.. ఎప్పుడండీ? పేపర్లోగాని పడిందా! ఎలాగండీ.. మన సొమ్ములు..? మేమయితే అన్నీ బయటే ఉంటే, దొంగల భయమని.. అన్నీ అందులోనే పెట్టాం" అన్నాడు వంశీకృష్ణ.

అది వినగానే నవ్వు ఆపుకోలేనట్లు, పడి పడి నవ్వుతున్న రాజేశంను చూస్తూ, "అంతేనండీ.. పిల్లికి చెలగాటం.. ఎలుకకు ప్రాణ సంకటం. మా కష్టాలు మీకు నవ్వులాటలాగే ఉంటాయి.." అన్నాడు ఉక్రోషంగా మొహానికి గంటు పెట్టుకుని వంశీకృష్ణ.

"క్షమించండి వంశీకృష్ణగారూ! నేను మిమ్మల్ని చూసి నవ్వటం లేదండీ. ఏప్రిల్ ఫస్ట్ కదాని ఫూల్‌ని చేద్దామని మా ఆవిడతో చెప్పిన అబద్ధం గంటయినా కాకముందే ఇలా కల్లోలం రేపుతుందని తెలియక, నవ్వాపుకోలేకపోయాను.. సారీ!" అన్నాడు రాజేశం.

"ఆఁ.." అంది కాఫీ కప్పులతో వచ్చిన మాధవి.

"మరి ఎదురింటి మీనాక్షి, పక్కింటి కామాక్షి.. కూడా అన్నారట.." అంటూ వంశీ అంటుంటే..

"నేనే వారితో అన్నాను. నాకేం తెలుసు ఈయన నాతో అబద్ధం చెబుతున్నారని.." అంది మాధవి కాఫీ కప్పులు అందిస్తూ.

"ప్రతి సంవత్సరం సరదాగా ఎవరినైనా 'ఏప్రిల్ ఫూల్' చేయటం నాకలవాటు. ఈసారి అది కాస్తా హాలీడే వచ్చేసరికి ఆ సరదా మా ఆవిడతో తీర్చుకుందామనుకున్నాను. కానీ, ఆడవారి నోటిలో నువ్వుగింజ నానదన్నది నిరూపిస్తూ, ఇలా పరిణమిస్తుందని ఊహించలా.." అంటూ నవ్వుతున్న రాజేశంతో శృతి కలిపారందరూ.

★